సాక్షి
మహబూబ్‌నగర్

శుక్రవారం । 6 । జనవరి । 2023



గ్రంథాలయాలకు క్యూ!

నోటిఫికేషన్లు వెలువడుతుండటంతో నిరుద్యోగులు లైబ్రరీలకు క్యూ కడుతున్నారు.

వివరాలు 8లో ▸



క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /18.5

వాతావరణం

ఉదయం ఆకాశం కొద్దిమేర మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రి చలి పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రీడా మైదానాల స్థలాలు అప్పగించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల స్థలాలు ఈ నెల 11లోగా అప్పగించాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. గురువారం అధికారులతో వీసీ నిర్వహించారు. మండలాలల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు ఎట్టి పరిస్థితిల్లో స్థలాలను అప్పగించాలన్నారు. టీకేపీలకు ఎక్కడైనా అటవీ భూములను గుర్తించిన చోట తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు వినియోగించుకునే విషయమై తక్షణమే అటవీ శాఖ పీసీసీఎఫ్‌కు లేఖ రాయాలన్నారు. క్రీడా ప్రాంగణాలకు స్థలాలు ఇచ్చే విషయంలో భూమి కొలతల శాఖ ఏడీ డీఐఓలు తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. ముందుగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక క్రీడా ప్రాంగణం ఉండేలా స్థలాలను ఇవ్వాలని, మొత్తం 441 టీకేపీలకు స్థలాలను ఈనెల 11లోగా అప్పగించాలన్నారు. మండలాలనికి రెండు బృహత్ పల్లె ప్రకృతి వనాల కోసం స్థలాలు అప్పగించడం జరిగిందన్నారు. హరితహారం నాటికి ప్రతి మండలానికి 2 బృహత్ పల్లె ప్రకృతి వనాల లక్ష్యంగా చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా గురువారం తుది ఓటర్ జాబితాను ప్రచురించాలని చెప్పారు. ఈ నెల 9న కంటివెలుగు కార్యక్రమంపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 14 మంది రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లు

పాలమూరు: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు కొత్తగా 14 మంది మెడికల్ ఆఫీసర్ల కేటాయించారు. దీంతో గురువారం జిల్లాలోని 17ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లలో మెడికల్ ఆఫీసర్లు బదిలీలు అయ్యాయి. కొత్తగా వచ్చిన మెడికల్ ఆఫీసర్లు 14 మందిలో పేరూర్‌లో ఇద్దరు, మిడ్జిల్ ఇద్దరు, అడ్డాకులలో ఒకరు, భూత్పూర్‌లో ఒకరు, దేవరకద్రలో ఇద్దరు, కోయిలకొండలో ఒకరు, హన్వాడలో ఒకరు, గండేడ్‌లో ఇద్దరు, కోత్లాబాద్‌కు ఒకరిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తగా కేటాయించిన మెడికల్ ఆఫీసర్లు అందరూ విధుల్లో చేరారు. అలాగే మహబూబ్‌నగర్ పట్టణంలో ఉన్న ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లకు ఒక్కొక్కరు మెడికల్ ఆఫీసర్లు వచ్చారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఎక్కడ కూడా ఖాళీలు లేకుండా ఆరోగ్యశాఖ అధికారులు సర్దుబాటు చేశారు.

మైనార్టీ రాయితీ రుణాల దరఖాస్తు తేదీ పొడిగింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ యువతకు 2022–23 సంవత్సరానికి స్వయం ఉపాధి కింద రాయితీ రుణాల కోసం కేటగిరి–1, కేటగిరి–2లో ఆన్‌లైన్‌లో చేసుకునే దరఖాస్తు తేదీని ఈనెల 9వ వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ అధికారి టైటస్‌పాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'కంటివెలుగు'పై శిక్షణ

పాలమూరు: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కంటివెలుగు కోసం కేటాయించిన 45 బృందాలతో యాప్ డౌన్‌లోడ్ చేయించి డమ్మీ రిజిస్ట్రేషన్ చేసి విజయవంతంగా అవుతుందా.. లేదా.. అని పరిశీలించారు. ఈ నెల 18 నుంచి కంటివెలుగు పరీక్ష శిబిరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆరోగ్యశాఖ పరిధిలో సిబ్బందికి శిక్షణ వేగవంతం చేశారు. మొదట డీఎంహెచ్‌ఓ, తర్వాత మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలకు ఇలా ప్రతి ఒక్కరికి దీనిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ కృష్ణ హాజరై ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రతిఒక్కరు బాధ్యతగా పని చేయాలన్నారు. యాప్ ఎలా డౌన్‌లోడ్ చేయాలి.. ఎలా రిజిస్ట్రేషన్ చేయాలి.. అనే అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

■ కంటి వెలుగు కార్యక్రమం పురోగతిపై గురువారం డీఎంహెచ్‌ఓతో ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ శ్వేతా మహంతి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ కృష్ణ పాల్గొని జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మొక్కజొన్న @ రూ2,220

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నకు రూ.2,220 ధర లభించింది. అలాగే ధాన్యం హంస గరిష్టంగా రూ.1,910, కనిష్టంగా రూ.1,729, ఆర్ఎన్ఆర్‌కు గరిష్టంగా రూ.2,359, కనిష్టంగా రూ.1,851, సోన రూ.1,869, కందులు గరిష్టంగా రూ.7,050, కనిష్టంగా రూ.6,409, వేరుశనగ గరిష్టంగా రూ.7,163, కనిష్టంగా రూ.4,289 ధరలు లభించాయి.

పెరిగిన ఓటర్లు

13 నియోజకవర్గాలు.. 28,62,467 మంది

- తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వనపర్తి నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు
- అలంపూర్‌లో అత్యధికంగా యువ ఓటర్లు
- కొల్లాపూర్‌లో 6,534 ఓట్ల తొలగింపు
- ఆధార్ సీడింగ్ నేపథ్యంలో తొలగిన వలస జీవుల ఓట్లు



సాక్షి, నాగర్‌కర్నూల్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి పాలమూరు జిల్లాలో షాద్‌నగర్ నియోజకవర్గం మినహాయించి 13 నియోజకవర్గాల్లో కలిపి 28,62,467 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపట్టిన కసరత్తు పూర్తికావడంతో ఈ మేరకు తుది జాబితాను సిద్ధం చేసింది. ప్రతిఏటా జనవరిలో ఈసీ ఓటర్ల జాబితా ప్రకటిస్తుంది. అయితే ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా వనపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 2,46,511 మంది ఓటర్లు ఉండగా.. జడ్చర్ల నియోజకవర్గంలో అత్యల్పంగా 2,02,404 మంది ఓటర్లు ఉన్నారు. వనపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 10,668 మంది కొత్తగా నమోదు కాగా.. అత్యల్పంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 2,855 మంది నమోదు చేసుకున్నారు. ఓటర్ల సంఖ్యాపరంగా చూస్తే వనపర్తి తర్వాత స్థానాల్లో గద్వాల, మహబూబ్‌నగర్, అలంపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. జడ్చర్ల నియోజకవర్గంలో అతి తక్కువగా 2,02,404 మంది ఓటర్లు నమోదుకాగా.. తర్వాతి స్థానాల్లో నాగర్‌కర్నూల్, నారాయణపేట నియోజకవర్గాలున్నాయి. నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లగా.. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని కొడంగల్ వికారాబాద్ జిల్లా పరిధిలోకి వెళ్లింది.

అలంపూర్‌లో యువ ఓటర్లు..

ఉమ్మడి జిల్లాలో 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటుహక్కు దక్కించుకున్న యువ ఓటర్లు అలంపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 4,237 మంది ఉండగా.. వనపర్తిలో 4,104 మంది యువ ఓటర్ల నమోదు చేసుకున్నారు. తర్వాతి స్థానంలో గద్వాల, నారాయణపేట నియోజకవర్గాలున్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 1,200 మంది యువ ఓటర్లు నమోదు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని గద్వాల, మక్తల్, అలంపూర్, దేవరకద్ర, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఉంది. ఇతరులు (థర్డ్ జెండర్) 52 మంది ఉండగా.. దేవరకద్ర, నారాయణపేటలో ఒక్కరు కూడా నమోదు కాలేదు.

ఉమ్మడి జిల్లాలో తుది ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఓటర్లు	చేర్చినవి	తొలగించినవి	పురుషులు	మహిళలు	ఇతరులు	యువ ఓటర్లు
మహబూబ్‌నగర్	2,29,760	3,372	212	1,15,028	1,14,724	8	1,772
జడ్చర్ల	2,02,404	3,581	583	1,02,076	1,00,326	2	1,619
దేవరకద్ర	2,15,220	4,043	1,070	1,07,269	1,07,951	-	1,932
నాగర్‌కర్నూల్	2,11,288	2,855	312	1,06,055	1,05,230	3	1,200
అచ్చంపేట	2,17,956	3,160	2,938	1,09,469	1,08,485	2	1,603
కొల్లాపూర్	2,14,594	3,155	6,534	1,09,515	1,05,075	4	1,350
వనపర్తి	2,46,511	10,668	1,168	1,23,830	1,22,676	5	4,104
గద్వాల	2,34,633	7,119	6,314	1,16,177	1,18,447	9	3,351
అలంపూర్	2,22,468	8,062	6,150	1,11,024	1,11,439	5	4,237
నారాయణపేట	2,13,330	7,254	1,654	1,06,191	1,07,139	-	3,042
మక్తల్	2,21,470	5,906	2,526	1,09,599	1,11,870	1	2,445
కొడంగల్	2,15,791	4095	2009	1,07,627	1,08,157	7	1,716
కల్వకుర్తి	2,17,042	3,267	727	1,10,975	1,06,061	6	1,658

'ఆధార్' లింకుతో..

ఈసారి ఓటరు జాబితా కసరత్తులో భాగంగా చాలావరకు నియోజకవర్గాల్లో ఆధార్ సీడింగ్ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా అమలుపర్చారు. ఈ కారణంగా ఆయా నియోజకవర్గాల్లో భారీగా వలస జీవుల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 6,534 ఓట్లు జాబితా నుంచి తొలగిపోగా.. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో అత్యల్పంగా 212, నాగర్‌కర్నూల్‌లో 312 ఓట్లను మాత్రమే ఓటర్ల తుదిజాబితా నుంచి తొలగించారు. కాగా ఉమ్మడి జిల్లా పరిధిలో మండలాలు ఉన్న కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా రంగారెడ్డి జిల్లాలో.. కొడంగల్ నియోజకవర్గ జాబితాను వికారాబాద్ జిల్లాలో ఎన్నికల సంఘం చేర్చింది.

మహబూబ్‌నగర్‌లో తగ్గుదల..



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రచురిస్తున్న డీటీ, సిబ్బంది

పాలమూరులో గతంతో పోలిస్తే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య తగ్గింది. జిల్లాలోని 3 నియోజకవర్గాల పరిధిలో 6,47,384 ఓటర్లు ఉన్నారు. గతేడాది అక్టోబర్‌లో 6,51,012 ఓటర్లు ఉండగా.. ప్రస్తుత జాబితాతో పోలిస్తే 3,628 ఓటర్ల సంఖ్య తగ్గింది. గతంలో ఉన్న పురుషుల జాబితాలో 1,522 మంది, మహిళా జాబితాలో 2,106 మంది తగ్గారు.

రెండోరోజే మొరాయింపు

- బయోమెట్రిక్ కోసం బారులుదీరిన ఉద్యోగులు
- అందరూ ఒకేసారి రావడంతో సమస్య

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నూతన కలెక్టర్ సమీకృత కార్యాలయంలో ఉద్యోగుల హాజరు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ రెండోరోజే మొరాయించింది. ఈ నెల 3న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం వివిధ కారణాలతో మిషన్లు పనిచేయలేదు. ఉద్యోగులందరూ ఒకే సమయంలో వచ్చి వెనువెంటనే బయోమెట్రిక్ ఇచ్చారు. దీంతో సర్వర్ బిజీ వచ్చి.. హాజరు అప్‌లోడ్ కాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. బయోమెట్రిక్ కోసం ఉద్యోగులు గంటల తరబడి క్యూలైన్లో నిల్చోవాల్సి వచ్చింది. కార్యాలయంలో సుమారు 2 వేల మంది ఉద్యోగులు ఉంటారని సమాచారం. ఇంత మంది ఉద్యోగులకు అక్కడ ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు కేవలం 4 మాత్రమే కావడంతో ఈ సమస్య నెలకొందని ఉద్యోగులు ఆరోపించారు. బయోమెట్రిక్ కోసం గంట ముందుగా కార్యాలయానికి రావాల్సి వస్తుందని వాపోతున్నారు. బయోమెట్రిక్ ప్రాసెస్ 2, 3 నిమిషాలు పడుతుందని ఈ లెక్కన 2 వేల మంది ఉద్యోగులకు ఎంత సమయం పడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాలుగు మిషన్లే..

కార్యాలయంలో 2 వేల మంది వరకు ఉద్యోగులు ఉండగా.. బయోమెట్రిక్ మిషన్లు మాత్రం 4 మాత్రమే ఏర్పాటు చేశారు. కనీసం మరో 10 మిషన్లను ఏర్పాటు చేస్తే సరిపోతుందని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆధార్ కార్డులోని 8 అంకెలను మిషన్‌లో కొట్టడం.. ఆ అక్షరాలు చిన్నగా ఉండటంతో చాలామందికి కనిపించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. బయోమెట్రిక్‌ను ఏర్పాటులో ఉన్న శ్రద్ధ.. సాధ్యాసాధ్యాలపై చూపకపోవడం దారుణం అన్నారు. అయితే బయోమెట్రిక్ మిషన్లలో ఏర్పడిన సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత సిబ్బంది చొరవ చూపారు.



బయోమెట్రిక్ కోసం బారులుదీరిన ఉద్యోగులు

నేడు డీఐజీ బాధ్యతల స్వీకరణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా పోలీస్ అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ గద్వాల జోన్ నూతన డీఐజీగా నియామకమైన ఎల్ఎస్ చౌహాన్ శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్‌లోని ఎస్పీ పాత చాంబర్‌లో ఏర్పాటు చేసిన డీఐజీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీ పాత చాంబర్‌ను రంగులు వేయడంతోపాటు ఫర్నీచర్, సుందరీకరణ పనులు చేపట్టారు. ఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు ఇతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి బాధ్యతలు తీసుకునే ఏర్పాట్లపై సమీక్షించారు. ఆ తర్వాత కార్యాలయంలో కొనసాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నూతన డీఐజీ బాధ్యతలు తీసుకోనున్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయానికి రానున్నారు.

■ ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలను కలిపి జోగుళాంబ జోన్ 2021 డిసెంబర్ 6న ఏర్పడిన విషయం తెలిసిందే. మొదట్లో మహబూబ్‌నగర్ ఐజీగా ఉన్న కమలాసన్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులో భాగంగా 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఎల్ఎస్ చౌహాన్‌ను నియమించింది. ఇకపై డీఐజీ కార్యాలయ పరిధిలో ఉన్న ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ ఎస్పీలపై పర్యవేక్షణ కొనసాగనుంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని పోలీస్ శాఖ కార్యకలాపాల పాలన మహబూబ్‌నగర్ డీఐజీ కార్యాలయం నుంచి కొనసాగనుంది. పోలీస్ శాఖలోని పరిపాలన ఉద్యోగుల సర్వీస్, ఎస్ఐ, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలు, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు తదితర విషయాలపై పర్యవేక్షణ ఉండనుంది.



ముస్తాబవుతున్న డీఐజీ కార్యాలయం

మందకొడిగా ఆస్తిపన్ను వసూలు

మూడు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 46 శాతమే..
- భూత్పూర్‌లో 40.1, జడ్చర్లలో 47.18 శాతం
- గడువులోగా లక్ష్యం పూర్తిచేస్తామంటున్న అధికారులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పురపాలక సంఘాలకు ప్రధాన ఆర్థిక వనరు ఆస్తిపన్ను. కాగా, ఈపాటికే ఈ ఆర్థిక (2022–23) సంవత్సరంలో తొమ్మిది నెలలు పూర్తయింది. ఇంకా మూడు నెలలు మాత్రమే మిగిలి ఉండగా.. ఆస్తిపన్ను వసూలు మందకొడిగా సాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పట్టణాల్లో రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ పన్ను వసూళ్లలో నిమగ్నమైనా ఆశించిన స్థాయిలో ఫలితం దక్కడం లేదు.

మున్సిపాలిటీల వారీగా ఇలా..


మహబూబ్‌నగర్ పట్టణంలో 47,444 అసెస్‌మెంట్లు (ఇళ్లు, దుకాణాలు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి ద్వారా ఈ ఏడాది రూ.15,89,85,000 ఆస్తిపన్ను రావచ్చని అంచనా వేశారు. అలాగే పాత బకాయిలు రూ.5,24,99,000 రావాల్సి ఉంది. ఇలా మొత్తం రూ.21,14,84,000 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు (ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31) రూ.9,76,64,000 ఆస్తిపన్ను వసూలు కాగా.. పాత బకాయిల కింద రూ.1,74,52,000 ఇలా మొత్తం రూ.11,51,16,000 మాత్రమే రాబట్టగలిగారు. ఇంకా రూ.6,13,21,000 ఆస్తిపన్ను రావాల్సి ఉండగా.. బకాయిల కింద రూ.3,50,47,000 ఇలా మొత్తం రూ.9,63,68,000 వసూలు చేయాల్సి ఉంది.

■ భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో 3,310 అసెస్మెంట్లు ఉండగా ఈ ఏడాది రూ.1,34,92,000 ఆస్తిపన్ను రావచ్చని అంచనా వేశారు. అలాగే పాత బకాయిలు రూ.59,66,000 రావాల్సి ఉంది. ఇలా మొత్తం రూ.1,94,58,000 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు (ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31) రూ.65,61,000 ఆస్తిపన్ను వసూలు కాగా.. పాత బకాయిల కింద రూ.12,41,000 కలిపి మొత్తం రూ.78,02,000 మాత్రమే రాబట్టగలిగారు. ఇంకా రూ.69,31,000 ఆస్తిపన్ను రావాల్సి ఉండగా.. బకాయిల కింద రూ.47,25,000 మొత్తం రూ.1,16,56,000 వసూలు చేయాల్సి ఉంది.

■ జడ్చర్ల పట్టణంలో 17,1170 అసెస్‌మెంట్లు ఉండగా ఈ ఏడాది రూ.2,59,57,000 రావచ్చని అధికారులు అంచనా వేశారు. అలాగే పాత బకాయిలు రూ.1,54,22,000 రావాల్సి ఉంది. ఇలా మొత్తం రూ.4,13,79,000 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు (ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31) రూ.1,64,01,000 ఆస్తిపన్ను వసూలు కాగా.. పాత బకాయిల కింద రూ.31,24,000 ఇలా మొత్తం రూ.1,95,25,000 మాత్రమే రాబట్టగలిగారు. ఇంకా రూ.95,56,000 ఆస్తిపన్ను రావాల్సి ఉండగా.. బకాయిల కింద రూ.1,22,98,000 ఇలా మొత్తం రూ.2,18,54,000 వసూలు చేయాల్సి ఉంది. ఇలా లక్ష్యంలో మహబూబ్‌నగర్ నుంచి 56 శాతం, భూత్పూర్ నుంచి 40.1 శాతం, జడ్చర్ల నుంచి 47.18 శాతం మాత్రమే చేరుకున్నారు.

■ అయితే ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారో వేచిచూడాల్సిందే. సాధారణంగా ఏటా మార్చిలోనే ఆస్తి పన్ను చెల్లించడానికి పట్టణ ప్రజలు ముందుకు వస్తారని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఏదేమైనా లక్ష్యం చేరుకుంటామని చెబుతున్నారు.

మున్సిపాలిటీల వారీగా పన్నుల లక్ష్యం, వసూళ్లు..(రూ.లక్షల్లో..)



వేగవంతం చేస్తాం..



మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూలు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఇందుకోసం మొత్తం ఆరు బృందాలను నియమించాం. ఇకపై ఈ వసూళ్లు వేగవంతం చేసి వచ్చే మార్చిలోగా వందశాతం లక్ష్యం సాధిస్తాం.

– మహమూద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

ధనిక రాష్ట్రాన్ని దివాళా తీయించారు

బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్రం ఏర్పడిన సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను దివాళా తీయించి బీఆర్ఎస్ అంటూ కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ నేత, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం ఇప్పుడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి చేరిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి పాలన సాగిస్తున్న కేసీఆర్ నుంచి విముక్తి కలిగేలా, ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కుటుంబ, ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రానికి ప్రమాదం అన్నారు. మునుగోడులో వంద మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, పోలీసుల సహకారంతో బీజేపీని ఓడించేందుకు ప్రయత్నించారన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉండటంతో బీఆర్ఎస్ అంటున్నారని, మాయమాటలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయ శక్తిగా ఉందనేది ప్రజలకు అర్థమైందన్నారు. ఇక్కడి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారాన్ని అడ్డంపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదనే విషయం గమనించాలన్నారు. విచ్చలవిడిగా దోపిడీ చేస్తూ బీజేపీ కార్యకర్తలను బెదిరించి, కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అవినీతి, అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు, బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా పోరాడాలని సూచించారు. నెలకోసారి పాలమూరుకు వస్తానని, మునుగోడుతో సమానంగా ఇక్కడ పనిచేస్తానన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎన్పీ వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అడ్డాకుల: మండలంలోని కందూర్ స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. అడ్డాకుల ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం డోకూర్‌కు చెందిన వాకిటి బుచ్చన్న(50) శాఖాపూర్ టోల్‌ప్లాజా వైపు నుంచి గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై పొన్నకల్ స్టేజీ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం బుచ్చన్నకు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బుచ్చన్న తల పగలడంతో పాటు ముఖం గుర్తు పట్టకుండా మారింది. అదేవిధంగా నడుము భాగం విరిగిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కొన్ని శరీర భాగాలు ముక్కలై రోడ్డుకు అతుక్కుపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఎల్అండ్‌టీ టోల్‌ప్లాజా సిబ్బందితో మృతదేహాన్ని బట్టలో కట్టించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల భాగం గుర్తు పట్టకుండా మారడంతో పోలీసులు ముందుగా గుర్తు తెలియని వ్యక్తిగా భావించి తర్వాత విచారణ చేశారు. బుచ్చన్న బంధువులు జిల్లా ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించిన తర్వాత అది వాకిటి బుచ్చన్న మృతదేహమేనని గుర్తించారు. మృతుని సోదరుని కుమారుడు పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

రైలు ఢీకొని..


కొండన్న (ఫైల్)

దేవరకద్ర రూరల్: పొలం పనులకు వెళ్తూ గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం కౌకుంట్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకుంట్లకు చెందిన మెట్ల కొండన్న (50) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. రోజులాగే పొలం వద్దకు వెళ్లేందుకు గ్రామ సమీపంలోని రైల్వే పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

వలలో చిక్కుకుని..


ఆంజనేయులు (ఫైల్)

పాన్‌గల్: చేపల వలలో చిక్కుకుని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మాధరావుపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన మండ్ల ఆంజనేయులు(40) గ్రామ సమీపంలోని బైరోవని చెరువులో బుధవారం సాయంకాలం చేపలవేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని మృతి చెందాడు. చెరువు సమీపంలోని రైతులు చెరువు కట్టపై దుస్తులు, చెప్పులను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. గురువారం చెరువులో వెతికితే శవం బయటపడింది. ఇతను గ్రామ జీపీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

చెరువులో పడి మహిళ ఆత్మహత్య

తెలకపల్లి: ఓ మహిళ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు... మండల పరిధిలోని కమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సునిత (28) ఈనెల 4వ తేదీన కమ్మరెడ్డిపల్లి శివారులో ఉన్న ఊరకుంటలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియడం లేదని ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త శివకుమార్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి అన్న ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్‌పై దాడి కేసులో రిమాండ్

ఎర్రవల్లిచౌరస్తా: విధుల్లో ఉన్న ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తిని 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు కోదండాపురం ఎస్సై వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు... కోదండాపురం గ్రామానికి చెందిన బోయ సుధాకర్ డిసెంబర్ 13న భార్యతో గొడవపడుతుండగా కుటుంబ సభ్యులు 100కు డయల్ చేశారు. కోదండాపురం పీఎస్‌కు చెందిన పోలీస్ సిబ్బంది రామచంద్రయ్య, తిరుమలయ్య సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ క్రమంలో భార్యతో అనవసరంగా గొడవ పడవద్దని అతనికి సూచిస్తుండగా కోపంతో బోయ సుధాకర్ ఒక్కసారిగా కానిస్టేబుల్ రామచంద్రయ్య కుడి చేతిని బలంగా కొరికి తీవ్రంగా గాయపర్చాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి గురువారం నిందితుడిని అలంపూర్ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఆదేశాల మేరకు 14రోజుల పాటు రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

గ్రంథాలయాలకు క్యూ!

- వరుస నోటిఫికేషన్లతో భారీగా వస్తున్న అభ్యర్థులు
- సేవలు విస్తృతం చేస్తున్న గ్రంథాలయ శాఖ
- అన్ని మండల శాఖ గ్రంథాలయాల్లో స్టడీ సెంటర్ల ఏర్పాటు
- పుస్తకాలు, టేబుల్స్ పంపిణీ
- సమయం సైతం ఉదయం 8గంటల నుంచి రాత్రి 7గంటలకు పెంపు


జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి పెద్ద ఎత్తున నోటిఫికేషన్‌లు వెలువరించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు కేంద్రమైన పాలమూరులో కోచింగ్ సెంటర్ ఇతర సదుపాయాలతో పాటు జిల్లా గ్రంథాలయంలో ఉచితంగా అభ్యర్థులు సిద్ధమయ్యేందుకు అన్ని వసతులు ఉండడంతో అభ్యర్థులు క్యూ కడుతున్నారు.

శాఖ గ్రంథాలయాలాల్లో సేవలు..

జిల్లా వ్యాప్తంగా పాత 11 మండలాల్లో అన్ని గ్రంథాలయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. అభ్యర్థులు మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయాల్లో సిద్ధమయ్యేలా సంస్థ చర్యలు తీసుకుంటుంది. అయితే జిల్లా కేంద్ర గ్రంథాలయానికి 350 మందికి పైగా వస్తున్నారు. స్టడీరూం, బయటహాల్‌తో పాటు మరో రెండు రూంలు కేటాయించినా అభ్యర్థులకు సరిపోవడం లేదు. కొత్తగా ప్రారంభించిన రాంనగర్ లైబ్రరీకి సైతం ప్రతి రోజు 200పైగా అభ్యర్థులు వస్తున్నారు. వీటితో పాటు దేవరకద్ర, జడ్చర్ల మండల శాఖ గ్రంథాలయాల్లో 150కి పైగా అభ్యర్థులు వస్తున్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేసి మండల శాఖ గ్రంథాలయాలకు కూడా స్టడీ రూంలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా గతంలో ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేవి. ప్రస్తుతం అభ్యర్థులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటలకు పెంచారు.

అభ్యర్థుల సంఖ్య ఆధారంగా వసతులు

మండల శాఖల్లో అభ్యర్థులు వస్తున్న సంఖ్య ఆధారంగా వసతులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఉద్యోగాలకు అవసరమైన పుస్తకాల విషయంలో అభ్యర్థుల కోరిక మేరకు మాత్రమే తెప్పించాల్సి ఉంటుంది. ఇక టేబుళ్లు, కుర్చీలు, ప్యాడ్‌లు ఇతర సదుపాయాలను కల్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. 11 మండలాల్లో ఇప్పటికే 2 మండలాల్లో సేవలు ప్రారంభం కాగా మరో 2 మండలాల్లో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. 7 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సేవలు ప్రారంభమైతే దాదాపు వెయ్యి మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మండల శాఖల్లో కూడా అవకాశం



ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా నుంచి అభ్యర్థులు పెద్ద ఎత్తున జిల్లా గ్రంథాలయానికి వస్తున్నారు. దీంతో అభ్యర్థుల ఒత్తిడి ఎక్కువైంది. అందుకోసం మండల శాఖ గ్రంథాలయాల్లో కూడా అభ్యర్థులు ఉద్యోగాలకు సిద్ధం అవ్వొచ్చు. అభ్యర్థులు శాఖ గ్రంథాలయాలకు వెళ్లే సంఖ్య ఆధారంగా పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తాం.

– రాజేశ్వర్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, మహబూబ్‌నగర్

యువతి మోసం చేసిందని ఆత్మహత్య


రామరాజు(ఫైల్)

ఉండవెల్లి: యువతి మోసం చేసిందని రైలు కిందపడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన మండలంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన బ్యాగరి రామరాజు (29) హైదరాబాద్‌లో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వచ్చి, అక్కడి నుంచి జోగుళాంబ రైల్వేహాల్ట్, ఆర్‌టీబీ మధ్యకు వచ్చాడు. కాగా తనతో తెచ్చిన బైక్‌ను ఇక్కడే పార్కింగ్ చేశానని రాత్రి అన్న రాజమోహన్‌కు మెసేజ్ పంపాడు. ఆ తర్వాత రైలుపట్టాలపై పడుకుని గుర్తు తెలియని రైలుఢీకొనడంతో మృతి చెందాడు. రైల్వే కీమన్ పోలీసులకు సమాచారం అందించాడు. ఉదయం మెసేజ్ చూసుకున్న అన్న సంఘటన స్థలం వద్దకు వెళ్లిచూడగానే మృతి చెంది ఉన్నాడు. యువతి తనను మోసం చేసి వేరొకరితో ప్రేమలో ఉన్నట్లు తెలుసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈయన గతంలో కర్నూల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా, మూడు నెలల క్రితమే హైదరాబాద్‌కు వెళ్లాడు. తండ్రి మాదన్న 9ఏళ్ల క్రితమే మృతి చెందగా, తల్లి రంగమ్మ, ఇద్దరు సోదరులు ఉన్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతదేహాన్ని అలంపూర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీగంధం చెట్ల చోరీ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

అడ్డాకుల: కష్టపడి పెంచిన శ్రీగంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ముత్యాలంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు విజయభాస్కర్‌రెడ్డి 2007లో 200 శ్రీగంధం, వెయ్యి ఎర్ర చందనం మొక్కలు నాటగా ప్రస్తుతం 60కి పైగా శ్రీగంధం చెట్లు పెద్దవయ్యాయి. ఇందులో 9 చెట్లు భారీగా ఉండటంతో వాటిపై దొంగల కన్ను పడింది. బుధవారం రాత్రి పొలంలోకి వెళ్లిన దొంగలు 9 చెట్లను నరికి చిన్న చిన్న కొమ్మలు, ఆకులను అక్కడే పారేసి దుంగలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు విజయభాస్కర్‌రెడ్డి గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు. చోరీకి గురైన ఒక్కో చెట్టు విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని.. రూ.27 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు.

అప్పులు చేసి ఉడాయించిన ఆర్ఎంపీ

ఆత్మకూర్: ఆర్ఎంపీగా గ్రామంలో చెలామణి అవుతూ పరిచయాలు పెంచుకుని అప్పులు చేసి ఉడాయించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో గద్వాలజిల్లా మానవపాడుకు చెందిన హరీశ్ ఐదేళ్లుగా కుటుంబంతో నివాసం ఏర్పరుచుకున్నాడు. గ్రామంలో అందరితో కలిసిపోయి వైద్యసేవలు అందిస్తూ తరచూ అప్పులు చేసి, అధిక వడ్డీ చెల్లించేవాడు. ఈ క్రమంలోనే సుమారు రూ.15లక్షల మేర అప్పులు, చీటీల డబ్బులు పోగుచేసుకుని ఉడాయించినట్లు తెలసింది. బెట్టింగులు, పేకాట కూడా ఆడేవాడని గ్రామస్తులు తెలిపారు. పేకాటలో పెద్ద ఎత్తున డబ్బులు పోవడంతోనే కుటుంబంతో సహా వెళ్లిపోయాడని, అతనిఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్‌గౌడ్ తెలిపారు.

యువజనోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి


జిల్లా పరిషత్ మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు నిర్వహించడానికి జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం, జిల్లా పరిషత్ మైదానం, సుదర్శన్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి యువజనోత్సవాల నిర్వహణపై ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలను పకడ్బందీగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌టీఈపీ (సెట్విన్) జనరల్ మేనేజర్ జి.వేణుగోపాల్‌రావు, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



వెల్దండ: మండలంలోని సిలోనిబావితండాలో బుధవారం అర్ధరాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం అందడంతో బుధవారం రాత్రి రూట్ వాచ్ నిర్వహించారు. అర్ధరాత్రి ఓ మారుతీ కారు, టాటాఏస్ ఆటో వాహనాలను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. వెల్దండ మండలం సిలోనిబావితాండకు చెందిన రాత్లావత్ మున్నా, ఉర్కొండ మండలం రాచాలపల్లితండాకు చెందిన బండోత్ సందీప్, హైదరాబాద్‌కు చెందిన పోలేపల్లి శివలు వాహనాల్లో నల్లబెల్లం తరలిస్తున్నారు. టాటా ఏస్ ఆటో వాహనంలో 30 బస్తాలు, ఒక్కో బస్తాలో 30కేజీల చొప్పున 9క్వింటాల నల్లబెల్లం, 3బస్తాలు పటిక ఒక్కో బస్తాలో 40కేజీల చొప్పున 1.20క్వింటాల పటిక, అదేవిధంగా మారుతీకారులో 10 కాటన్ డబ్బాలు ఒక్కో కాటన్ డబ్బా 20కేజీల చొప్పున 2క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసు లు తెలిపారు. అదేవిధంగా రెండు వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్ఐలు వెంకటేష్, దిలీప్‌రెడ్డి, కానిస్టేబుల్స్ మహేష్, రాఘవేంద్ర, భిక్షపతి ఉన్నారు.

అమ్రాబాద్ మండలంలో..

అమ్రాబాద్: కొత్తపల్లిలో గురువారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి ఉపయోగించే 3.30 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.అక్రమ సారా తయారు చేసే వ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాడులు చేసిన వారిలో ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ బాలరాజు, సతీష్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ బంతిలాల్, స్వాతి ఉన్నారు.

కోడిపందెం స్థావరంపై దాడి

- 17 బైక్‌లు, రూ.14,400 స్వాధీనం

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లితండా శివారులో గురువారం కొందరు కోళ్ల పందేలు ఆడుతుండగా దాడి చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి చేశామని, 8 మందిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించామన్నారు. 4 కోడి పుంజులు, 17 బైక్‌లు, రూ.14,400 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తప్పించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయానికి విడతలుగా త్రీఫేజ్ విద్యుత్


పెంచికలపాడు శివారులో నాట్లు వేసుకుంటున్న రైతులు

సాక్షి ఎఫెక్ట్..

గట్టు: యాసంగి పంటల సాగుకు రెండు విడతలుగా రాత్రి, పగలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లుగా విద్యుత్ అధికారులు తెలిపారు. యాసంగిలో విద్యుత్ కోతలపై 'సాక్షి'లో ఈ నెల 3న 'కోతలు.. వెతలు', 5న 'అన్నదాత ఆగమాగం' అన్న శీర్షికలతో వరుస కథనాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రచురించగా.. విద్యుత్ అధికారులు స్పందించారు. గురువారం నుంచి వ్యవసాయానికి రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, తిరిగి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5–45 వరకు త్రీఫేజ్ విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇది వరకు గట్టు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కేవలం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే మాత్రమే త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసే వారు. దీంతో ఇక్కడి రైతులు ఈ నెల 2న విద్యుత్ సబ్ స్టేషన్‌కు చేరుకుని వ్యవసాయానికి రాత్రి పూట కూడా విద్యుత్ సరఫరా చేయాలని ఆందోళనకు దిగడంతోపాటు విద్యుత్ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. రైతుల ఇబ్బందులను కొందరు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో మాట్లాడి గతంలో మాదిరిగానే వ్యవసాయానికి విడతలుగా విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. గురువారం నుంచి వ్యవసాయానికి రాత్రి, పగలు విడతల వారిగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తుండడంతో స్థానిక రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కష్టాలు తీరడంతో అటు సాక్షికి, ఇటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు బోర్లు, బావుల కింది వరి నాట్లు వేసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మందా జగన్నాథం, ఎమ్మెల్యే అబ్రహం, మందకృష్ణ మాదిగ

అయిజ: న్యాయవాదిగా, ఆర్థిక, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికి నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని మేడికొండలో గురువారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మందా జగన్నాథం, ఎమ్మెల్యే అబ్రహం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అన్నారు. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమన్యాయం జరిగేలా వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు సార్వభౌమాధికారాన్ని దక్కించుకునేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. యావత్ భారతావని ఆయన అందించిన విలువైన సేవలను స్మరించుకుంటోందని కొనియాడారు. కార్యక్రమంలోసర్పంచ్ తిప్పారెడ్డి, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకే పునరావాసం



వటువర్లపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- ఇళ్లు, పాఠశాలలు, అన్ని వసతులు కల్పిస్తాం
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

మన్ననూర్: ప్రజల అభీష్టం మేరకే పునరావాసం కల్పించేందుకు అటవీశాఖ ముందుకు రావడం మంచి పరిణామమని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. అభయారణ్యం పరిసర ప్రాంతంలోని అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామాన్ని తరలించే క్రమంలో పునరావాసం కల్పిస్తున్న పలు అంశాలను తెలియజేసే క్రమంలో భాగంగా సర్పంచ్ చత్రునాయక్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా గ్రామాన్ని విడిచి వెళ్తున్న క్రమంలో ఒకటికి వందసార్లు ప్రతి ఒక్కరు ఆలోచించి మంచి నిర్ణయానికి రావాలని గ్రామ ప్రజలకు కలెక్టర్ సూచించారు. అభయారణ్యం ప్రాంతంలో జీవనోపాధికి ఇబ్బందిగా ఉందని అనుకుంటేనే నిర్ణయం తీసుకోండని సూచనాప్రాయంగా అన్నారు. రీ లొకేషన్‌కు మీలో మీకు అభిప్రాయ భేదాలు రావడం, ప్యాకేజీ కేటాయింపులు తదితర వాటిని నివృత్తి చేయడానికి కొంత సమయం పడుతుందని అన్నారు. ఇదిలా ఉండగా అందరికి కేటాయిస్తున్న ప్యాకేజీలోనే ఇండ్లు, పొలాలు, వీధులు, పాఠశాలలు, దవాఖాన తదితరవి ఉంటాయని, అది కాదు కూడదని అంటే ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీనీ డబ్బు రూపాన తీసుకునే అవకాశం కల్పించే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. నిర్మల్ జిల్లా కవ్వాల్ అనే ప్రాంతంలో ఇలాంటి ప్యాకేజీ ప్రభుత్వం తరుపున ఇదివరకే ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడి పరిస్థితులను చూడాలనుకుంటే అక్కడికి తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వం తరుపున ఏర్పాట్లు చేయిస్తామని అన్నారు.

ఐదు ఎకరాల్లోపు భూమి ఇచ్చేందుకు ఏర్పాట్లు..

డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కొంత కాలంగా సార్లపల్లి, కుడిచింతలబైలు, వటువర్లపల్లి గ్రామాల ప్రజలు పునరావాసం కల్పించాలని ముందుకు రావడంతో ఇదివరకే ఎన్‌జీఓ సంస్థలతో కూడా అవగాహన కల్పించామని అన్నారు. అదేవిధంగా పునరావాసం కోసం మైదాన ప్రాంతంలో కొన్ని ప్రదేశాలను కూడా చూపించడం జరిగిందని అన్నారు. 2 నుంచి 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ప్యాకేజీ, పునరావాసం గురించి సర్పంచ్‌తో పాటు అవగాహన కలిగిన కొందరితో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని డీఎఫ్‌ఓ గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ చత్రునాయక్ మాట్లాడుతూ ప్రజల నిర్ణయం మేరకు ప్యాకేజీ కల్పించినట్‌లైతే తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, 5 ఎకరాల వ్యవసాయ భూమి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మూడేళ్లలో పునరావాసం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ,తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలకు నీరు పోస్తున్న రమేష్‌నాయుడు


తోపుడు బండిపై నీటి బిందెలను తీసుకెళ్తూ..

మొక్కలపై ప్రేమ!

- ఏటా 250 మొక్కలను పెంచుతున్న వీఆర్ఏ

పెంట్లవెల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితాహారం కార్యక్రమంలో భాగంగా సొంతంగా మొక్కలు నాటి, వాటికి నీరు పోసి పెంచుపోషిస్తున్నాడు ఓ వీఆర్ఏ. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మంచాలకట్టకు చెందిన రమేష్‌నాయుడు వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన గ్రామంలో నాటిన మొక్కలకు ప్రతి రోజు దాదాపు 150బిందెలకు పైగా నీళ్లను తీసుకెళ్లి పోస్తున్నాడు. ప్రతి సంవత్సరం ఈయన గ్రామంలో 250కు పైగా మొక్కలను రోడ్ల వెంట నాటి, వాటిని బ్రతికించేందుకు తపన పడుతున్నాడు. ఇందుకు సొంతంగా ఒక తోపుడు బండిని ప్రత్యేకంగా తయారు చేయించుకున్నాడు. దానిపై తెలంగాణకు హరితహారం అని రాయించాడు. సమయం దొరికినప్పుడల్లా ఉదయం, సాయంత్రం తోపుడు బండిపై బిందెలతో నీటిని పట్టుకుని ఆయన తోసుకుంటూ వెళ్లి మొక్కలు నీళ్ల పడతాడు. దీంతో అతడు చేస్తున్న సేవకు గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

క్లుప్తంగా...


మృతుడు ఇమ్మడి లక్ష్మారెడ్డి

పొలంలోనే రైతు తుదిశ్వాస

బచ్చన్నపేట: వ్యవసాయ క్షేత్రంలోనే రైతు తుది శ్వాస విడిచిన సంఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కేసిరెడ్డిపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు ఇమ్మడి లక్ష్మారెడ్డి తనకున్న కొద్దిభూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉండటంతో అక్కడికి వెళ్లి వస్తుంటాడు. బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన లక్ష్మారెడ్డి పొలంలో గెట్లు సరిచేస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. జీవాలను మేతకు తీసుకెళ్తున్న వ్యక్తులు గమనించి పరిశీలించగా అప్పటికే లక్ష్మారెడ్డి మృతి చెందాడు. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని గ్రామంలోని ఇంటి వద్దకు తీసుకొచ్చారు. లక్ష్మారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతుల ఖాతాల్లో రూ. 296.85 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఎనిమిదో రోజు రైతుల ఖాతాల్లో రూ.296.85 కోట్ల రైతుబంధు నిధులు జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులు 5,93,717.02 ఎకరాలకు విడుదల చేశామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు 54,70,637 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.4,327.93 కోట్లు జమ చేశామని వివరించారు.

ఉపాధ్యాయునిపై దాడి దారుణం

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడి చేయడాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. చట్టాన్ని గౌరవించాల్సిన వ్యక్తులు దురుసుగా ప్రవర్తించడం సరికాదని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరాచక శక్తులను అణచివేయాలని యూఎస్పీసీ నేతలు కె.జంగయ్య, చావా రవి, వై.అశోక్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు.

బాబు వాడుకున్నారు.. జనం ఆడుకున్నారు

టీడీపీ గిమ్మిక్కును బయటపెట్టి.. ఎండగట్టిన నెటిజన్లు

- ఆశించిన స్థాయిలో జనం రాక టీడీపీ షాక్
- దాంతో మార్ఫింగ్ ఫొటోలను వైరల్ చేసిన పార్టీ శ్రేణులు
- కర్ణాటకలోని సిద్దేశ్వరస్వామి అంతిమయాత్ర ఫొటోలను వాడుకున్న వైనం.. టీడీపీ గిమ్మిక్కు గుట్టురట్టు చేసిన నెటిజన్లు

కుప్పం గడ్డ.. చంద్రబాబు అడ్డా.. అంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిలీజ్ చేసిన వీడియో



వాస్తవానికి ఆ వీడియో కర్ణాటకలో జరిగిన సిద్దేశ్వరస్వామి అంతిమయాత్రకు సంబంధించినది



సాక్షి, అమరావతి: జనాదరణ పోయింది. పిలిచినా సభలకు రావటం లేదు. దీంతో ఎలాగైనా తమకు జనాదరణ తగ్గలేదని చూపించడానికి చంద్రబాబు ముఠా ఎల్లో మీడియా, సోషల్ మీడియా వేదికగా మరో దుస్సాహసానికి దిగింది. చంద్రబాబును చూసేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను ఈ ముఠా వైరల్ చేసింది. 'కుప్పం గడ్డ.. ఇది చంద్రబాబు అడ్డా'అనే నినాదాలతో విపరీతంగా జనం కనిపిస్తున్న ఆ ఫొటోలను కొన్ని ఎల్లో చానెళ్లు కూడా ప్రసారం చేశాయి. ఇక సోషల్ మీడియాలో అయితే టీడీపీ బ్యాచ్ మొత్తం ఈ ఫొటోలను షేర్ చేస్తూ శివాలెత్తిపోయింది. కానీ నిజమేంటో తెలుసా? ఆ ఫొటోలు కుప్పంలోనివి కాదు. అసలు రాష్ట్రానికే సంబంధం లేని ఫొటోలు. కర్ణాటక రాష్ట్రంలో అత్యంత ప్రముఖుడిగా గుర్తింపు పొందిన సిద్దేశ్వర స్వామి సోమవారం మరణించగా... ఆయన అంతిమ యాత్రకు దాదాపు 2 లక్షల మంది భక్తులు, సామాన్య ప్రజలు హాజరయ్యారు. భక్తుల్లో చాలా మంది పసుపు రంగు దుస్తులు ధరించి ఉండటం... వాహనానికి కూడా పసుపు రంగు ఉండటంతో ఇది తమకు సరిగ్గా మ్యాచ్ అవుతుందనుకున్న టీడీపీ వర్గాలు... ఆ ఫొటోలను, వీడియోలను డౌన్‌లోడ్ చేసి తమ బాబు సభకు వచ్చిన జనం అంటూ వైరల్ చేసేశాయి.

ఏకి పారేసిన నెటిజన్లు...
ఆ ఫొటోల లోగుట్టును నెటిజన్లు క్షణాల్లోనే పట్టేశారు. ఆ ఫొటోలు కుప్పంలో చంద్రబాబు పర్యటనవి కావంటూ నిగ్గు తేల్చారు. చుట్టుపక్కల పరిసరాలు, ఆ ఫొటోల్లో ఉన్న ప్రజల ఆహార్యాన్ని గుర్తించిన ప్రజలే.. ఇవి ఫేక్ అంటూ ఎండగట్టే సరికి పచ్చ గ్యాంగ్‌కు దిమ్మ తిరిగిపోయింది. 'బాబు మరీ ఇంత ఫేకా'అంటూ నెటిజన్లు ఏకిపారేశారు.

పాలు ఎందుకు ఇవ్వడం లేదు?

సాక్షి కథనంపై స్పందించిన మంత్రి సత్యవతి రాథోడ్

- యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో 'మూడు నెలలుగా పాలు లేవ్'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. గురువారం ఉదయం ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు నెలలుగా పాల సరఫరా నిలిచినందుకు గల కారణాలపై ఆరా తీశారు. పాల పంపిణీ నిలిచిపోవడంతో పిల్లలకు పౌష్టికలోపాలను అధిగమించే కార్యక్రమం నీరుగారుతుందని చెబుతూ.. తక్షణమే పాల సరఫరా పునరుద్ధరించాలని ఆమె ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, టెండరు ఖరారు, కాంట్రాక్టరు ఎంపిక అయ్యే వరకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అందుకే పాలు సరఫరా చేయలేకపోయాం... కేఎంఎఫ్ వివరణ
ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడం వల్లే అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు పంపిణీ నిలిచిపోయిందని కర్ణాటక కోఆపరేటివ్ మిల్క్



ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్(కేఎంఎఫ్) లిమిటెడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్న తమ సంస్థ గతేడాది సెప్టెంబర్ నెల వరకు పూర్తి స్థాయిలో పక్కాగా సరఫరా చేసినట్లు వివరించింది. గతేడాది సెప్టెంబర్‌తో కాంట్రాక్టు ముగిసిందని, కానీ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక ఆదేశాలతో పాల పంపిణీ కొనసాగించాలని నిర్ణయించినట్లు వివరించింది. కానీ పాడి పశువులు పెద్ద సంఖ్యలో లంపిస్కిన్ వ్యాధి బారిన పడడంతో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయిందని, దానికితోడు గత నవంబర్, డిసెంబర్‌లలో తీవ్ర వర్షాలు కురవడంతో పాల రవాణా పడిపోయిందని, దీంతో పాల కేంద్రాలకు కోటా రాలేదని వివరించింది. త్వరలోనే పాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కేఎంఎఫ్ వివరించింది.

వెలుగుల్లో ఎస్టీపీపీ మరో రికార్డు

- తాజాగా పీఎల్ఎఫ్‌లో దేశంలోనే మొదటిస్థానం
- 250 థర్మల్ విద్యుత్ ప్లాంట్లను వెనక్కి నెట్టి ముందు వరుసలోకి
- సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ హర్షం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ) మరో రికార్డు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఎంపిక చేసిన అత్యుత్తమ 250 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 7,219 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 91.15 శాతం పీఎల్ఎఫ్ (ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్)తో దేశంలోనే మొదటి స్థానంలో ఈ ప్లాంట్ నిలిచింది. అంతేకాక ఈ ఏడాదిలోనే వరుసగా రెండుసార్లు ఈ స్థానాన్ని అందుకుంది. 250కి పైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఎన్టీపీసీ, అదానీ, టాటా, రిలయన్స్, జిందాల్ తదితర పేరు మోసిన సంస్థలను వెనక్కి నెట్టి మరీ జైపూర్ ప్లాంట్ ముందు వరుసలో నిలిచింది. జైపూర్ ప్లాంట్ రికార్డులపై సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ గురువారం హర్షం వ్యక్తం చేశారు.

ఆరేళ్లలో అద్భుత ప్రగతి
సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీయడం, రవాణా, అమ్మకాలకే పరిమితి కాకుండా సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి విక్రయించాలని జైపూర్‌లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పింది. 2016 ఆగస్టులో ఈ ప్లాంట్ ప్రారంభం కాగా, గత ఆరేళ్లలో అత్యుత్తమ ప్రతిభతో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీరుస్తూ ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తోంది. ఇప్పటివరకు 52,328 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించింది. రాష్ట్రం వినియోగిస్తున్న విద్యుత్‌లో 12 శాతం ఇక్కడి నుంచే అందుతోంది. సింగరేణికి ఏటా సగటున రూ.400 కోట్ల లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ ప్లాంట్‌లో రెండు యూనిట్లు సమర్థంగా పని చేస్తున్నాయి. రెండో యూనిట్ ఇప్పటికి 10 సార్లు, మొదటి యూనిట్ ఎనిమిది సార్లు పీఎల్ఎఫ్ దాటింది. మొత్తంగా ఈ ప్లాంట్ నాలుగుసార్లు వంద శాతంపైబడి పీఎల్ఎఫ్ రికార్డు చేసింది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ మేరకు రూ.6,800 కోట్లతో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఇక్కడే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

పర్యావరణహిత చర్యలు
బొగ్గు మండించగా వెలువడిన బూడిద నిర్వహణ, నీటి వినియోగం, ఎనర్జీ ఎఫీషియెన్సీలోనూ అద్భుత ప్రతిభ చూపుతూ ఈ ప్లాంట్ పలు జాతీయ అవార్డులు అందుకుంది. నీటిపై తేలియాడే పలకలతో సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే పర్యావరణ హితంగా విద్యుత్ ఉత్పత్తికి రూ.700 కోట్లతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ యూనిట్ నిర్మాణం కూడా జరుగుతోంది. ఇది అందుబాటులోకి వస్తే కాలుష్యం మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెపుతున్నారు.

బాలికపై అన్నదమ్ముల అత్యాచారం

- మాయమాటలతో నమ్మించి పలుమార్లు లైంగికదాడి
- బాలిక ఇన్‌స్టాగ్రామ్‌కు అసభ్యకర సందేశాలు
- బాలిక తండ్రి వాటిని చూడటంతో బయటపడిన దారుణం
- వరంగల్‌లో ఘటన

ఖిలా వరంగల్: తెలిసీ తెలియని వయసు.. దగ్గరలోనే ఇల్లు.. ఆ బాలికకు మాయమాటలు చెప్పిన ఇద్దరు అన్నదమ్ములు శారీరకంగా లొంగదీసుకున్నారు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం గురువారం వరంగల్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బతుకుదెరువు కోసం ఇద్దరు కుమార్తెలతో కలసి దంపతులు వరంగల్‌కు వలస వచ్చారు. వెంకట్రామ జంక్షన్ సమీప కాలనీలోని బంధువుల ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వారి పెద్ద కుమార్తె పదో తరగతి, చిన్న కుమార్తె 8వ తరగతి చదువుతున్నారు. కాగా, దయానంద్ కాలనీకి చెందిన ఓ పాత ఫర్నిచర్ షాపు యాజమాని ఎండీ ఆయూబ్ అలీకి అజ్మత్ అలీ(26), అక్బర్ అలీ(22) అనే కుమారులు ఉన్నారు. వీరిద్దరూ పదో తరగతి చదివే బాలికపై కన్నేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ బాలికతో వీరికి పరిచయం ఏర్పడింది. బాలిక ఇద్దరినీ అన్నా అంటూ పిలిచేది. దీంతో వారి మధ్య చనువు ఏర్పడింది. కానీ అన్నదమ్ములు ఆ బాలికకు మాయ మాటలు చెప్పి, ఒంటరిగా ఉన్నది చూసి ఇంట్లోకి రప్పించుకుని ఒకరికి తెలియకుండా మరొకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఇలా ఆరునెలలుగా బాలికపై పలుమార్లు వేర్వేరుగా లైంగికదాడికి పాల్పడ్డారు. బాలిక ఇన్‌స్టాగ్రామ్‌కు వారు అసభ్యకరమైన మెసేజ్‌లు పోస్ట్ చేయడంతో ఇటీవల విషయం తండ్రికి తెలిసింది. తల్లిదండ్రులు కుమార్తెను నిలదీయడంతో అన్నదమ్ములు అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పింది. బాలిక తల్లి బుధవారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఎండీ అజ్మత్ అలీ, అక్బర్ అలీపై ఫిర్యాదు చేసింది. నిందితులిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. నిందితులిద్దరినీ పోలీసులు బుధవారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా నిందితులు పరారీలోనే ఉన్నారని తెలిపారు. బాలికపై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ గురువారం బంధువులు, స్థానికులు ఆందోళనకు దిగారు. నిందితుల ఇంటిపై దాడి చేసి కిటికీ అద్దాలు, ఆవరణలోని ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో వెంకట్రామ జంక్షన్ నర్సంపేట రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కాగా, వరంగల్ ఏసీపీ కల్కోట్ల గిరికుమార్ బాలికను, ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు.

వలసలు తగ్గాలంటే బీజేపీ గెలవాలి

కొల్లాపూర్ రూరల్: నియోజకవర్గంలో వలసలు ఆగాలంటే బీజేపీ గెలవాలని జాతీయ ఖాదీ బోర్డు కమిషన్ సభ్యుడు పేరాల శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని సున్నపుతండా, బోడబండ తండా, ఎల్లూరులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు చేస్తున్న ప్రగతి కోసం పాదయాత్ర 29వ రోజుకు చేరుకుంది. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి కాలేదన్నారు. అనంతరం పార్టీ జెండాను ఎగరవేశారు. సుధాకర్‌రావు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


వాలీబాల్ ఆడుతున్న బాలికలు

- మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు
- ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. ఓడినవారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. ఈ క్రీడల్లో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, టేబుల్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు నాగరాజు (మహబూబ్‌నగర్), చంద్రశేఖర్ (వనపర్తి), పరమేశ్వరి (కోస్గి)తోపాటు ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఫలితాలు..
మొదటి రోజుల్లో బాలికల విభాగం చెస్‌లో రూప (పెబ్బేర్), మేఘన (జేపీఎన్‌సీఈ), మహేశ్వరి (మహబూబ్‌నగర్), జావెలిన్ త్రోలో స్వాతి (వనపర్తి), శ్రీలత (మహబూబ్‌నగర్), శ్రావణి (వనపర్తి), డిస్కస్‌త్రోలో శ్రీలత (మహబూబ్‌నగర్), జ్యోతి (మహబూబ్‌నగర్), స్వాతి (వనపర్తి), షాట్‌పుట్‌లో శ్రావణి (వనపర్తి), ఇందు (మహబూబ్‌నగర్), రాధ (వడ్డేపల్లి), లాంగ్‌జంప్‌లో నవీత (కోస్గి), దీపిక (పెబ్బేర్), తేజస్వి (మహబూబ్‌నగర్), హైజంప్‌లో పల్లవి (పెబ్బేర్), శిరీష (మహబూబ్‌నగర్), మౌనిక (పెబ్బేర్), ట్రిపుల్ జంప్‌లో శిరీష (మహబూబ్‌నగర్), నవీత (కోస్గి), ఇందు (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. శుక్రవారంక్రీడాపోటీలు ముగియనున్నాయి.

బయటపడ్డ ఏళ్లనాటి ఇటుకలు


పురాతన దేవాలయ గాలి గోపురం నుంచి బయట పడ్డ ఇటుక

దేవరకద్ర: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల గాలి గోపురాలు శిథిలావస్థకు చేరడంతో దేవస్థాన కమిటీ వాటిని తొలగించే పనులు చేపట్టారు. వాటి స్థానంలో ఇప్పటి గాలి గోపురాల నిర్మాణం చేపట్టడానికి ఏర్పాట్లను చేశారు. డిసెంబర్ 29 నుంచి పనులు ప్రారంభం కాగా, ప్రస్తుతం రెండు దేవాలయాల గోపురాలు, ధర్మ సత్రం పై కప్పు తొలగింపు పనులు పూర్తి చేశారు. వందల ఏళ్ల క్రితం గాలి గోపురాల నిర్మాణం కోసం ఇటుకలు బయట పడుతున్నాయి. ఇప్పటి ఇటుకలతో పోల్చితే రెండింతల పెద్ద సైజులో ఉన్నాయి. ఆనాడు ఇటుకలతో పాటు సున్నం గచ్చును ఉపయోగించి గాలి గోపురాల నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తున్నది. ఆనాటి కాలంలో ఎంతో నాణ్యతతో చేసిన పనులు చూసిన ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. ప్రస్తుతం శివాలయం పై కప్పు ప్రహరి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

ప్రకృతి ప్రేమికులు.. మామిడి రైతులు

వీపనగండ్ల: వాతావరణ సమతుల్యం కోసం అధిక ఆక్సీజన్ ఇచ్చే మామిడి తోటలను పెంచుతున్న రైతులను ప్రకృతి ప్రేమికులుగా చెప్పవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తసురేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో 'మామిడి తోటల పెంపకం – యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై పాన్‌గల్, చిన్నంబావి, వీపనగండ్ల మామిడి రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మామిడి సాగులో మూస పద్ధతి అవలంబించడంతో అధిక పెట్టుబడులు వెచ్చించి నష్టపోతున్నారని తెలిపారు. ఖర్చులు తగ్గించుకునేందుకు పశువుల ఎరువు, జీలుగ సాగు, సామూహికంగా మందులు వాడటం, థైవాన్ పంపులను వినియోగించాలని సూచించారు. ఈ సీజన్‌లో కొన్ని చెట్లకు పూత తక్కువగా రావడం, మరికొన్ని చెట్లకు రాకపోవడం, లేత ఆకులతో కనిపిస్తున్నాయని వివరించారు. నల్ల తామర, తేనెమంచు పురుగు పూతల సుతిమెత్తని బాగాలను పాడు చేస్తోందని, బూడిద మచ్చ తెగులుతో తోటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వీటి నివారణకు చెట్లకు హాని చేయని పురుగుమందులైన మోనోక్లోరోఫైరిపాస్, రోగర్, క్లోనోపిక్స్, కానుగనూనె, వేపనూనె, బోరాన్, సాప్ తదితర మందులను ఉద్యాన, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. ఎంపీపీ కమలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మామిడి రైతులను కాపాడాలన్న ఉద్దేశంతో కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సీజన్‌లోనే వీపనగండ్లలో మామిడి కొనుగోలు సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సురేష్, ప్రజాప్రతినిధులు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్

మెళకువలు పాటిస్తే గిట్టుబాటు ధర..
మామిడి కాయల విక్రయ సమయంలో మార్కెట్ మెళకువలు పాటిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేష్ అన్నారు. నాణ్యమైన మామిడి సైతం ఇతర ప్రాంతాలకు ఎగుమతి కావడం లేదంటే అందుకు కారణం రైతులు తమ తోటలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడమేనని తెలిపారు. తోటలను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో ప్రభుత్వం నుంచి అందే అన్నిరకాల రాయితీలతో పాటు తోటల పెంపకం, మార్కెట్ తరలింపు తదితర అంశాలకు సంబంధించిన రాయితీ పరికరాలను పొందవచ్చని సూచించారు. ఈ నెల 20 తర్వాత ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ వేసవిలో మండల మహిళా సమైఖ్య ద్వారా మామిడి కొనుగోలు చేపడతామని వివరించారు. కొల్లాపూర్ మామిడికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం ఉన్నా.. కోత, విక్రయ సమయంలో శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడంతో అధిక ధర పొందలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యాన అధికారుల సూచనలు పాటించి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. ఖమ్మంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళా జట్లను గురువారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో ప్రకటించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించాలని సూచించారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజా ఖాన్ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చని అన్నారు. గతంలో జిల్లా నెట్‌బాల్ జట్లు పలుసార్లు రాష్ట్రస్థాయిలో చాంపియన్లుగా నిలిచాయని, ఇదే స్ఫూర్తితో ఈ టోర్నీలో ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదత్‌ఖాన్, కోశాధికారి సోహైల్ ఉర్ రహెమాన్, సీనియర్ క్రీడాకారులు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు: సయ్యద్ అంజద్‌అలీ, విక్రం ఆదిత్యరెడ్డి, మహ్మద్ హబీబ్‌ఖాన్, అక్రం, షరీఫ్, మహ్మద్ ఇస్మాయిల్, అర్బాజ్, సంజు, ఆకాష్, అఖిల్, అమర్, ప్రవీణ్, ఇర్షాద్. **మహిళా జట్టు:** ముస్కాన్ బేగం, ఎం.శ్రవంతి, రాగిణి, శివగంగా, సాయిప్రియ, అరుణ, ఆర్.స్రవంతి.


జిల్లా నెట్‌బాల్ జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

- 24 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారిణులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు 24 పతకాలు మహబూబ్‌నగర్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, పి.పరశురాం తెలిపారు. కోల్‌కతాలో ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు.

పతకాలు సాధించిన వివరాలు..
పి.జగదీశ్వర్ 35+ఏళ్ల విభాగంలో 100మీ., లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలు, విజయప్రసాద్ 40+విభాగం షాట్‌పుట్, జావెలిన్‌త్రో బంగారు, ఖాజామైనద్దీన్ 45+విభాగం హ్యామర్‌త్రోలో బంగారు, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో కాంస్యం, అహ్మద్ హుస్సేన్ 55+ విభాగం 5000 వాక్‌లో, లాంగ్‌జంప్‌లో బంగారు, టీఎం.మణి 70+విభాగం జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రోలో బంగారు, షాట్‌పుట్‌లో రజతం, సీతమ్మ 40+విభాగం షాట్‌పుట్, డిస్కస్‌త్రో కాంస్యం, 200మీ రజతం, పి.రాములు 40+విభాగం 400 మీ, 800 మీటర్ల పరుగులో రజతం, సత్యం 40+విభాగం షాట్‌పుట్‌లో రజతం, గౌరిశంకర్ 55+విభాగం 5000 వాక్‌లో రజతం, జయప్రకాశ్ నారాయణ 60+విభాగం 800మీ., 1500మీ.లో బంగారు, 5000 వాక్‌లో రజతం, జ్యోతి 3+ విభాగం షాట్‌పుట్, 200మీటర్లలో కాంస్య పతకాలు సాధించారు.

పీయూకు ఐఎస్‌ఓ గుర్తింపు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి ఐఎస్‌ఓ-9001 సర్టిఫికెట్ లభించింది. ఈమేరకు రిటైర్డ్ జడ్జి సుందర్‌రామయ్య, హైమ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డీ శివయ్య గురువారం వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఐఎస్‌ఓ బృందం డిసెంబర్ నెలలో పీయూలోని పలు డిపార్ట్‌మెంట్‌లను పరిశీలించి నాణ్యతా ప్రమాణాల ఆధారంగా సర్టిఫికెట్ అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,060, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.